# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## – 22 –

# మరో మెల్ బోర్న్ కథ కాని కథ

ఏ ముహూర్తాన గత ఆగస్ట్ లో మెల్ బోర్న్ వెళ్ళానో కానీ అక్కడ ఉన్నది మూడు రోజులే అయినా ముచ్చటగా ఈ మూడో అమెరికట్టు కథ అల్లడం జరుగుతోంది. మొదటి కథ కిందటి సారి కౌముది లోనూ, రెండోది ఈ నెల మధురవాణి.కామ్ లోనూ వ్రాసి , ఎవరు చదివినా చదవక పోయినా ఈ మూడోది ఇప్పుడు వ్రాసుకో బుద్ధి వేసింది. నిజంగా అలాగే జరగక పోయినా అమెరికాలక్షేపానికి పనికొచ్చే సరుకు ఈ అమెరికట్టు కథలో ఉంది అనుకుంటున్నాను. చదివిన వాళ్ళకి ప్రశంసలు..చదవని వాళ్లకి ఏం చెప్పినా, చెప్పకపోయినా ఒకటే కదా!

మెల్ బోర్న్ లో దిగిన మొదటి రోజు అక్కడి తెలుగు సంస్థ పెద్దాయన ప్రతీ వారాంతం లోనూ నడుపుతున్న తెలుగు బడికి నన్నూ, "పద్మభూషణ్" యార్లగడ్డ వారినీ తీసుకెళ్ళారు. అక్కడి పోలిసీ ప్రకారం స్థానిక హైస్కూల్ లో ప్రపంచంలో ఏ భాష అయినా సరే నేర్పడానికి




ఆస్ట్రేలియా ప్రభుత్వమే తరగతి గదులు ఇస్తుందిట. అంత కన్నా ఆశ్చర్యం ఏమిటంటే తెలుగు చెప్తున్న ఇద్దరు టీచర్లకీ ఆస్ట్రేలియా ప్రభుత్వమే జీతాలు ఇస్తుందిట. ఈ మాట తెలుగు ప్రభుత్వాలకి...ముఖ్యంగా నవ్యాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారికి తెలిస్తే ఆస్ట్రేలియా ప్రభుత్వం వారి అమాయకత్వానికి జాలి పడతారు. లేక పోతే పరాయి భాషల మాట దేవుడెరుగు, మాతృ భాష అయిన తెలుగు నేర్పడం, తెలుగు మేష్టారికి జీతం ఇవ్వడం లాంటి అఘాయిత్యాలు ఏమిటి.. ఎవరైనా నవ్వి పోతారు. అంతే కాదు. అక్కడ గోడ మీద ఉన్న తెలుగు వర్ణ మాల చూసి కొంచెం సిగ్గు పడ్డాను. ఎందుకంటే క్రిందటి సారి ఆంధ్రా వెళ్ళినప్పుడు నేను చూసిన ఐదారు పాఠశాలల గోడల మీదా ఇంగ్లీషు వర్ణమాల పోస్టర్లే కానీ ఇలాంటి తెలుగు వర్ణమాల కనపడ లేదు మరి. అంతేనా అంటే అంతే కాదు. ఇంకా ఉంది. ఇక్కడ జత పరిచిన ఒక పద్యం చూడండి....ఈ పద్యం రెండు తరగతులలోనూ అన్ని బల్లల మీదా ఉంది. ప్రతీ వారం పాఠాలు మొదలు పెట్టేటప్పుడు ముందు ఈ



పద్యం పిల్లల చేత చదివిస్తారుట. ఏ మాట కామాటే చెప్పుకోవాలి. మన రాజకీయ నాయకులు కూడా "మన దేశమును మీరు ప్రేమించుమన్నా" అనే మాట చెప్తారు. అంటే కానీ ప్రవాసంలో ఉన్న మనందరికీ "మీరు మన దేశాన్ని పొగడండి. ఇక్కడే ఉండి డాలర్లు పంపించండి. పెట్టుబడులు పెట్టండి. కానీ వెనక్కి వచ్చి తెలుగో, గిలుగో అంటూ మమ్మల్ని చావగొట్టకండి". ఇక్కడ 'అన్నా' అంటే ఎన్టీఆర్ బాణీ అని అర్థం.




ఉన్న మాట చెప్పొద్దూ. మా కాకినాడ భాషలో "మనకి ఆంగ్లం అబ్బ లేదు. కానీ తెలుగు దొబ్బింది."

ఇక పాఠశాల సందర్శనం అయ్యాక సాయంత్రం మెల్ బోర్న్ లో ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ అవుతున్న Palais Theatre అనే ఒకానొక అత్యాధునిక సినిమా హాలుకి వెళ్ళాం. ఇలాంటి వాటికి ముందుగానే టిక్కెట్లు కొనుక్కోవాలి కానీ మెల్ బోర్న్ లో ME TV అనే ఇండియన్ టెలివిజన్ చానెల్ వాళ్ళు మమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తాం కానీ మేము ఫిల్మ్ ఫెస్టివల్ లో ఉంటాం కాబట్టి మీరే ఇక్కడికి రావాలి అన్నారు కాబట్టి అక్కడికి వెళ్ళడానికి అది అసలు కారణం అయితే ఇలాంటి గ్లేమర్ చోట్లకి అందమైన ఆడంగులు బట్టలు వేసుకున్నాం అని మనకి భ్రమ కలిగించడానికి రెండు, మూడు గుడ్డ పీలికలు చుట్టుకుని వస్తారు కదా, సౌందర్య వీక్షణ పుణ్యం కూడా కలుగుతుందేమో అన్నది పైకి చెప్పకూడని మరొక కారణం. తీరా అక్కడికి వెళ్ళాక కాస్త వర్షం, చలి మొదలవగానే నేను ఒక సారి డిల్లీ వెళ్ళినప్పుడు మా చిన్నన్నయ్య కూతురు ఇచ్చిన దేశవాళీ స్వెట్టర్ వేసుకుని ఆ టీవీ వారి "కొరుకుడు" లో మాట్లాడాను. "కొరుకుడు " ..అంటే "బైట్" అనమాట... ఎందుకంటే....అక్కడ రాబోయే నవంబర్ 3-4, 2018 లో జరగబోయే 6వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు గురించి అందరికీ తెలియాలి కదా! అది ఈ క్రింది లంకె లో తప్పకుండా చూడండి. నేను స్వెట్టర్ వేసుకుని బుద్ధిగా చేతులు కట్టుకోడానికి కారణం మెల్ బోర్న్ చలి మాత్రమే అని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

https://www.facebook.com/TAAI3000/videos/327463414482383/

ఈ వీడియో ని ఇప్పటికి రెండు వేల మంది పైగా చూశారు. వారిలో ఎంత మంది ఆ సదస్సుకి రాకుండా ఉంటారో చూద్దాం.

ఈ తతంగం అయ్యాక అమెరికాలక్షేపానికి మెల్ బోర్న్ లో ప్రసిద్ధమైన క్రౌన్ కేసీనో కి వెళ్లాం. అక్కడ మనం చూసే పనే కానీ చేసే పని లేదు. అంటే ఉంది కానీ ఆ గేంబ్లింగ్....బ్లాక్ జాక్ పేకాట కానీ, గల గల లాడే స్లాట్ మెషీన్స్ లో కానీ జూదం మొదలెట్టానో, ఇక అంతే సంగతులు. వేసుకున్న చొక్కా, లాగూ కూడా ధర్మరాజులా శుభ్రంగా క్షవరం చేయించుకుని మళ్ళీ అమెరికా రాడానికి కుదరక అక్కడే వనవాసం చెయ్యాలి. ఎందుకంటే మన జాతకం అన్ లక్కీ ఇన్ పేకాట, లక్కీ ఇన్ ప్రేమాట....ట. పైగా జూదం లో నెగ్గే వాడు ప్రేమలో ఓడి పోతాడుట. తీరా నేను పొరపాటున నెగ్గి పారేస్తే? ఈ వయసులో అది అవసరమా? ఇక కేసీనో లో చుట్టూ తిరిగి ..అవును ..అక్కడ కూడా ఉన్న దోశ గుడిశ లో దోశలు తిని, ఆనందించి



హోటల్ కి చేరాం. ఇలాంటివే పులిహోర గుడిశ, సాంబారు హట్, బిర్యానీ హట్ లాంటివి మెల్ బోర్న్ లో చాలానే ఉన్నాయి కాబట్టి 6వ ప్రపంచ సాహితీ సదస్సుకి సాహిత్యం మాట ఎలా ఉన్నా కడుపు నిండడానికి లోటు లేదు.

అన్నట్టు ఇప్పటికే ఈ ప్రపంచ సాహితీ సదస్సుకి అనేక దేశాల నుంచి స్పందన బావుంది. సుమారు వంద పైగా ఆస్ట్రేలియా వీసాల కోసం ఆహ్వానాలు పంపించాం. చూద్దాం ఎంత మంది వచ్చి ఆ వేదికని అలంకరిస్తారో మరి!

**COMMENTS**